


కెవియస్. శర్మ

# కౌర్యం

రాఘవమ్మ మూర్తీభవించిన దైన్యంలా వుంది. నలుగురిలోకి రావటం అలవాటులేని మనిషవటంచేత వరండాలో ఒదిగి నిలబడింది. కాని అల్లా రావల్సి వచ్చినందుకు సిగ్గుగా తలవంచుకుంది. చీరమీద మాసికలు ఆమె లేమిని పట్టిచ్చినా రాఘవమ్మ నుదిటిమీద ముడతలు, తెల్లనిజుట్టు, దరిద్రంవల్ల ఇతరులకు ఆమె అంటె తేలిక అభిప్రాయం కలుగకుండా సాయపడుతున్నాయి. రాఘవమ్మ సుబ్రమణ్యంగురించి వరండామీద వేచికూర్చుంది. సుబ్రమణ్యం ఆ గవర్నమెంటాఫీసుకు పెద్ద. అందుకని ఆఫీసు తెరచి గంటైనా ఆఫీసుకు రాలేదు.

దిక్కులేని దివాణంలో ఎలుకల్లాగా,

గుమాస్తా లెక్కడపడితే, అక్కడ విచ్చలవిడిగా ఆఫీసంతా ఓరిగేస్తూ, ఆ క్రితంరోజు సాయింత్రం వాళ్ళు విడి పోయినప్పటినుంచి, ఈ రోజు పొద్దున దాకా జరిగిన విశేషాలు, ఆడ టైపిస్టుతో మగస్టెనో ఆమె ఇంటికి వెళ్ళి కాఫీతాగిన వైనం వగైరాలు మాట్లాడుకుంటు న్నారు. అందులో ఒకరిద్దరు, మాట్లాడ టానికి మనుషులు దొరకని వాళ్ళు, రాఁవమ్మని గుర్తుపట్టినవాళ్లు "సూరి గాడేమైనా, మళ్ళీకొత్తవేధీవేస్తున్నాడా?" అంటూ ఆమెను పలకరించారు. "అవును బాబు వాడింటో ఇచ్చేడబ్బు బాగా తగ్గిం చేసాడు బాబు," అని జవాబు చెప్పింది రాఁవమ్మ. అల్లా చెప్పాల్సివచ్చినందుకు ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

సూర్నాయుడిని ఎవరూ ఆ పేరుతో పిలవరు. అందరూ సూరిగాడనే అంటారు. వాడికి పద్నాలుగేళ్ళు. ఈ సూరిగాడు, వెంకట్నాయుడి కొడుకు. వెంకట్నాయుడిని అందరు గౌరవంగా "ఏమోయి నాయుడు!" అని పిలిచే వారు. వెంకట్నాయుడు కూడా ఆ ఆఫీ సులో అదే వుద్యోగం చేసాడు. అల్లాంటి వెంకట్నాయుడి కొడుకుని సూరిగాడని అందరు పిలవడానికి-వాడంటే అందరికి వున్న తేలిక అభిప్రాయమే కారణం. వాడాఫీసులో అందరికీ అయిదో పదో బాకీపడటం, వాడి గురించి స్వయంగా వాడి తల్లి రాఁవమ్మే వచ్చి ఫిర్యాదు చెయ్యటం, వాడికాట్టే వయస్సులేకపోడ మనే కారణాలవల్ల వాడంటే అందరికి తేలిక అభిప్రాయం కలిగింది.

వెంకట్నాయుడా ఆఫీసులో గౌర వంగా వుద్యోగంచేసాడు. అందరికీ పని చేసిపెట్టి వాళ్ళుడబ్బిస్తే తీసుకునే వాడు. అప్పుచేసేవాడుకాదు. తప్పనిసరై తీసు కున్న అప్పు అన్నసమయానికి తంటాలు పడి తీర్చేవాడు. అయితే ఆకలి మరిచి పోడానికి వెంకట్నాయుడు కాల్చిన బీడీలకు అతను నలభై ఏళ్ళకే బలై పోయాడు. అతను చచ్చిపోయేదాకా అతను బీడీలు తాగుతాడని ఎవరికీ తెలి యదు. నాయుడెవరి ఎదుట బీడీలు కాల్చలేదు. అతను పోయినపుడు అతని భార్యా అయిదుగురుపిల్లలు వీధిలో పడ్డారు. వెంకట్నాయుడు కుటుంబానికి ఆస్తీ మిగల్చలేదు, అప్పులూ మిగల్చ లేదు.

వెంకట్నాయుడి కుటుంబాన్ని ఆదు కోడఁకోసం ఆఫీసు వాళ్ళందరు చందాలు వేసుకున్నారు. సుబ్రమణ్యం పాతిక రూపాయలిచ్చాడు. ఇల్లాంటి విషయాల్లో అనుభవంవున్న గుమాస్తా ఆ డబ్బుని రెండు భాగాల్చేసి, మొదటి భాగం వెంటనే కుటుంబానికి అంద జేసాడు. అది వాళ్ళు కర్మకి ఖర్చుచేసేసి మళ్ళీ తిండికి అల్లల్లాడుతుంటే రెండో భాగం అందజేయటానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఆ పేటలోని పెద్దనాయు

ళ్ళంతా, రాఘవమ్మ ఇంట్లో ఆ కుటుంబం ఇంకముందు ఏం చెయ్యాలన్న విషయంపైన పంచాయితీ చేస్తున్నారు. ఆ సమయంలో డబ్బివ్వటానికి వెళ్ళిన గుమాస్తాని "గుమాస్తాగారొచ్చారు" అంటూ గౌరవంగా ఆహ్వానించారు. అతన్తో తమ మనసులో పీకుతున్న మాట చెప్పారు. "మా సూరిగాడికి మీ ఆఫీసులో వుద్యోగం ఏయించరాదా బాబూ! మీ కాళ్ళకాడ పడుంటాడు." అంతమంది మాట తీసెయ్యలేక ఆ గుమస్తా "అల్లాగే పెద్దవాళ్ళ చెవిన ఈ మాట వేస్తాను" అని మాటఇచ్చి బయల్దేరాడు. అందరూసంతోషించారు, సూరిగాడుతప్ప. ఆ మాటలువిన్న సూరిగాడు పుస్తకాలని కౌగలించుకుని బిగుసుకుపోయాడు వాడికి నిజంగా వుద్యోగం వచ్చేస్తుందేమో అప్పుడు స్కూలు మానెయ్యాల్సొస్తుందేమోనన్న దిగులు కలిగింది. వాడింతవరకు తప్పకుండా పరీక్షలు పాసవుతూ వుండటంచేత వాడి చదువు మాన్పించాలన్న ఆలోచన వెంకట్నాయుడికెప్పుడూ కలగలేదు పైగా చదువుకోమని ఆపేక్షగా ప్రోత్సహించేవాడు. అందుకని వాడికి బాగా చదువుకోడానికి మించిన బాధ్యతలు ప్రపంచంలో వుంటాయని తెలియదు. గుమాస్తా వెళ్ళగానే వాడు బెరుకుగా తల్లికేసి చూసాడు. రాఘవమ్మ ఆ చూపు గమనించలేదు. గమనించినా అర్థం చేసుకోగలిగేదికాదు. అర్థంచేసుకున్నా ఆదరించగలిగిన స్థితిలోలేదు. అందుకని కాదని చెప్పటానికామె తలుపుచాటు నుంచి బయటికి రాలేదు.

ఆ విధంగా సూరిగాడి వుద్యోగానికి విత్తనం పడింది. రాఘవమ్మ ఇంటికి వెళ్ళొచ్చిన గుమాస్తా, మిగిలిన గుమాస్తాల్తోటి, వాళ్ళంతాకలిసి పెద్దగుమాస్తాతోను, అతను సుబ్రమణ్యంతోను వెంకట్నాయుడికొడుకు సూరిగాడికి తమ ఆఫీసులో వుద్యోగం ఇప్పిస్తే బాగుంటుందని చెప్పారు. ఆ విధంగా ఆ కుటుంబంపట్ల వాళ్ళకిగల సానుభూతి వ్యక్తపరిచారు. అందులో ప్రతివాళ్ళకి వాళ్ళని ఆశ్రయించుకుని, వాళ్ళ ఇళ్ళల్లో పనిచేస్తూ, వాళ్ళ ఆఫీసులో ఖాళీకోసం ఎదురుచూస్తున్న మనుషులున్నారు. కాని ఈ ఖాళీ సహజంగా అయిందికాదు కనుక, వెంకట్నాయుడి ఆత్మకి సంతృప్తికలుగకపోతే ఆఫీసు చూరుపట్టుకుని వేళ్ళాడే అవకాశంవుంది కనుక, ఆఫీసులో వాళ్ళందరు తమ ఆశ్రితులకికాక సూరిగాడికే ఆవుద్యోగం రావాలని కోరారు. సుబ్రమణ్యం ప్రజాస్వామ్యపద్ధతులను, ప్రమాదంలేని పరిస్థితుల్లో అంటే తన కేవిధంగాను నష్టంరాని పరిస్థితుల్లో అమలు జరిపే తెలివైన వాడు

"అందరిమాట ఎలావున్నా నాకు నాయుడంటే చాలా గౌరవం వుంది.

అతని కుటుంబానికి సహాయం చెయ్యా లన్న కోరిక బలంగా వుంది. నాయుడు సర్వీసులోపోయాడు. కనుక సూరిగాడి కుద్యోగం వేయించటంలో ఇబ్బంది వుండకపోవచ్చును" అని హామీఇచ్చి ఆపైన కొంతప్రయత్నంచేసి సూరిగాడికి వుద్యోగం వేయించాడు.


ఆమాట గుమాస్తావెళ్ళి రాఁవమ్మతో చెప్పినప్పుడు ఆ పేట నాయుళ్ళంతా సంతోషించారు. సూరిగాడదృష్టవంతు డన్నారు. ఆ కుటుంబం ఒడ్డున పడిం దన్నారు. అందర్నీ వెళ్ళనిచ్చి "అమ్మా, నే చదువుకుంటానే. చదువుకుని గుమాస్తా వుద్యోగంచేసి బాగా డబ్బు సంపాదిస్తానే" అన్నాడు సూరిగాడు.

"సీగ్గాని మతోయిందేట్రా! నువ్వా సదూకుంటే నోట్లోకెళ్ళల్లేదెల్లా? నే నెప్పుడూ యీదిలో కెళ్ళిన్దాన్ని కాను. సదూలు అవీ, అన్నీ వున్నోళ్ళకిగాని మనలాటోళ్ళకి కాదు." అంటూ రాఁవమ్మ సూరిగాడి ఆశలు నిర్దాక్షిణ్యంగా తుంచేసింది.

సూరిగాడాఫీసులో వుద్యోగానికి జేరినపూట సుబ్రమణ్యం వాడిని పిలచి "మీ నాన్నలా మంచిపేరు తెచ్చుకో! నీ కుద్యోగం ఇచ్చామంటే కారణం మీ నాన్న మంచితనం. అతనివల్లకాకపోతే ఈ వుద్యోగం నీ కొచ్చేదికాదు. అందుకని నీ సంపాదనమీద మీ కుటుంబానికంతటికి హక్కుందని మర్చిపోకు" అంటూ సూరిగాడికి వాడి కుటుంబంపట్ల వాడి బాధ్యత గురించి బోధచేసాడు.

వెంకట్నాయుడిలాగానే సూరిగాడు ఆఫీసు వేళల్లో ఆఫీసుపనిచేసి, మిగిలిన వేళల్లో గుమాస్తాలిళ్ళల్లోను, సుబ్రమణ్యం ఇంట్లో పనిచేసేవాడు. అయితే ప్రతివాళ్ళకి సూరిగాడికి వచ్చిన వుద్యోగం తాము పెట్టిన బిక్షే అన్న అభిప్రాయం వుండటంవల్ల సూరిగాడికి అట్టే ముట్టజెప్పేవాళ్లుకారు. పోతే పొగడటం చేసేవారు. అయితే చదువుకున్న సూరిగాడు పొగడ్తలు నెలచివరిదాకా తన కుటుంబానికి అన్నంపెట్టవని త్వరలోనే అర్థంచేసుకున్నాడు. వాడికీ, తండ్రికీ, స్కేలు ఒకటే అయినా వీడు స్కేలు మొదట్లోవుంటే, తండ్రి చివరలో వుండటంవల్ల జీతంలోవున్న తేడాకూడా వాడు అర్థంచేసుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే, అంటే తనజీతం ఇంటి ఖర్చులకి సరిపోడం లేదని సూరిగాడు గ్రహిస్తున్న రోజుల్లో, ఆ పేటలోనేవున్న కిష్టిగాడు, సుబ్బిగాడు, ఇటు చదువు అటు పనిలేనివాళ్ళు, నిరుద్యోగ సమస్యకి నిదర్శనాలు, సూరిగాడికంటె పెద్దవాళ్ళు, సూరిగాడితో స్నేహంచేసారు. వాళ్లోనెల చివర బచ్చాలాడ్డానికి పిల్చారు. రెండ్రోజులాడించి సూరిగాడి కందులో కాస్త అభిరుచి కలిగాక డబ్బులుపెట్టి





ఆడదామన్నారు. సూరిగాడు తన దగ్గర డబ్బుల్లేవన్నాడు. వాడు ఓడిపోతే డబ్బి వ్వక్కర్లేని షరతుమీద సూరిగాడు ఆడ డానికి ఒప్పుకున్నాడు. ఆ రోజు సూరి గాడు రూపాయిగెలిస్తే, సుబ్బిగాడు, కిష్టిగాడు నిజాయితీగా ఆ రూపాయి వాడికిచ్చేసారు. డబ్బులు పెట్టి ఆడటం అలవాటుగా మారేవరకు, డబ్బులు పెట్టి ఆడకుండా వుండలేనంతవరుకు, సూరి గాడే ఆటచివరకి పదో పదిహేనో పైనలు గెల్చేటట్టు వాడిస్నేహితులు జాగ్రత్తపడ్డారు. ఆ డబ్బు వాడు ఖర్చు లకి వాడుకున్నాడు. ఈలోగా జీతాలు వచ్చాయి. జీతాలొచ్చిన రోజునమాత్రం సూరిగాడు ఆటలో ఓడిపోయాడు. ఓడినడబ్బు గెల్చుకోవాలన్న ఉద్రే కంలో మరికొంత ఓడాడు. ఆ నెల జీతం రాఁవమ్మ చేతిలోపెడుతూ "ఈ నెల పదిరూపాయలు తక్కువిచ్చారు" అని ఓ చిన్న అబద్ధం ఆడాడు.

సూరిగాడు ఎప్పుడూ ఓడిపోతూ వుంటే వాడు ఆటకి రావటం మానేస్తా డేమోనని అప్పుడప్పుడు వాడిని గెలవ నిస్తూ వుండేవారు, వాడితోటి ఆటగాళ్లు. దాంతో సూరిగాడికి, వాడికి ఆటలోగల నైపుణ్యంమీద ఎప్పుడూ అపనమ్మకం కలగలేదు. అయితే వాడు ఇంటికిచ్చే డబ్బులో ఆరునెలలు తిరిగేసరికి ముప్పై రూపాయలు తగ్గింది. అప్పుడు రాఁవ మ్మకి చిన్నవాడినిచేసి ఆఫీసులో జీతాలు సరిగా ఇవ్వటంలేదేమోనన్న అనుమానంతో జీవితంలో మొదటి సారిగా ఆ ఆఫీసు గుమ్మం ఎక్కింది. ఆమె చెప్పింది విని ఆఫీసువాళ్ళు

ఆశ్చర్యపోతే వాళ్ళు జీతం సరిగ్గానే ఇస్తున్నారని విని రాఁవమ్మ ఆశ్చర్య పోయింది. సుబ్రమణ్యం నిలదీసి నప్పుడు సూరిగాడు నిజం చెప్పాడు. సుబ్రమణ్యం ప్రతినెల మొదటి తారీకున వచ్చి రాఁవమ్మనే జీతం తీసుకువెళ్ళ మన్నాడు. "నే నెప్పుడూ ఈదిలో కొచ్చిందాన్ని కానుబాబూ? మీరే కుఱ్ఱాణ్ణి గట్టిగా బయం పెట్టాల" అని వేడుకుంది రాఁవమ్మ. "నీ గురించి మరోసారి ఇల్లాంటి కంప్లైంటు మీ యింటినుంచివస్తే ఊరుకోను" అంటూ సుబ్రమణ్యం ఉరిమాడు. సూరిగాడు తలొంచుకున్నాడు.

సూరిగాడు జీతంరాగానే తల్లి కివ్వటం, ఆమె ఇచ్చిన అయిదో పదో పైసలు తీసుకోడం మొదలుపెట్టాక వాడు డబ్బులకి కటకటలాడటం మొదలుపెట్టాడు. అందుకని ఎవరికైనా పనిచేసి పెట్టినప్పుడు ఇంట్లో ఎవరికో జ్వరమనో, జలుబనో చెయ్యిచాచటం కూరా నారా తెచ్చినప్పుడు అందులో మిగుల్చుకోటం మొదలు పెట్టాడు. చెయ్యిచాచటంవల్ల కలిగే ఫలితం రెండు నెలల్లోనే బాగా పడిపోయింది. ఎవరు మాత్రం ఎన్నిసార్లని ఆదుకోగలరు! డబ్బులు రావటం తగ్గగానే సూరిగాడి బుద్ధి పాదరసంలా పనిచేయటం మొదలు పెట్టింది. "అమ్మగారు మిమ్మల్నడిగి రెండ్రూపాయలు తీసుకుని కూరలు తెమ్మన్నారు" అనో, మరో అబద్ధమో చెప్పి మోసం చెయ్యటం మొదలు పెట్టాడు. అయితే ఒకసారి మోస పోయినవాళ్ళు మరోసారి సులభంగా మోసపోరు కనుక, కొత్త వాళ్ళని వెదు క్కోటమో, కొత్త పద్ధతులు అవలం బించటమో చెయ్యాల్సివచ్చింది. వీడి ఆగడాలు మితిమీరి, ఆఫీసులో వాళ్ళ సహనం నన్నగిల్లి జీతాలనాడు గుమాస్తా లందరు కాబూలీవాళ్ళలాగా ఎవరి డబ్బులు వాళ్ళు వాడిదగ్గర వసూలు చేసారు. ఆరోజు వాడు నిర్భయంగా "ఆఫీసులో ఇంతే ఇచ్చారు. కావాలంటే వెళ్ళి అడుగు" అని రాఁవమ్మతో చెప్పాడు.

ఆ తరువాత రెండు మూడు నెలలు వాడు బుద్ధిగానే వున్నాడు. వాడి బుద్ధి నిలకడకి పరీక్షగా అవతరించాయి గవర్నమెంటు లాటరీలు. అందరూ ఆ టిక్కెట్ల కెగబడటం సూరిగాడు చూసాడు. ఈ ఎగబడటం అన్నదాంట్లో ఆఫీసరు, ప్యూను అన్న తేడా లేక పోవడం గమనించాడు. అందులో ఏమీ లేకపోతే ఎందుకు ఎగబడతారని ప్రశ్నించుకున్నాడు. ఎక్కడో ఒక రిషావాడో, కూలివాడో లాటరీ గెల్చి లక్షాధికారైన కథలు విని ఉత్సాహం పుంజుకున్నాడు. తన దరిద్రం తీరి పోడానికి లాటరీ ఒకటే మార్గమను



కున్నాడు. ఆ విధంగా డబ్బు సంపాదించాక తను చెయ్యాల్సిన పనుల పట్టిక తయారు చేసుకున్నాడు. తన తమ్ముడికి మంచి చదువు చెప్పిస్తాడు. చెల్లెళ్ళకి కార్లో తిరిగే సంబంధాలు చేస్తాడు. తల్లికి వంటలో సాయానికి వంటమనిషిని పెడ్తాడు. ...ఆపైన... వీలుంటే తను చదువుకుంటాడు. ఈ పంచరంగుల కల సూరిగాడికి చాలా నచ్చింది. వెంటనే జీతాలందినపూట ఓ పాతిక టిక్కెట్లు కొనేసాడు. తల్లి రాఁవమ్మ జీతం విషయం నిలదీస్తే "సుబ్రమణ్యంగారు పుట్టినరోజుట. ఆయనకేదైనా కొని ఇయ్యాలని జీతం కోనేసారు" అని జవాబు చెప్పాడు. రాఁవమ్మకి ఆఫీసుకివెళ్ళి "నిజమేనా?" అని అడిగే ధైర్యంలేక మానుకుంది. డబ్బుతగ్గినందుకు బాధపడుతున్న తల్లి ముఖంచూసి సూరిగాడు ఓ క్షణంపాటు పశ్చాత్తాపపడ్డాడు. కాని వెంటనే

"లాటరీలో నాకు లక్షరూపాయలు తగిల్నప్పుడమ్మ ముఖం చూడాల" అనుకుని సర్ది పెట్టుకున్నాడు. అయితే సూరిగాడిని అదృష్టం ఆ నెల ఆపై నెల కూడా వరించలేదు. సిండికేటుల్లోజేరినా లాభంలేకపోయింది. వరుసగా మూడు నెలలు జీతం డబ్బులు తగ్గేసరికి ఇంట్లో తిండికి ఇబ్బంది కలిగింది. అందుకని ఆ రోజు విధిలేక రాఁవమ్మ రెండోసారి ఆఫీసుకొచ్చింది.

రాఁవమ్మ సుబ్రమణ్యంకోసం కాసు కూర్చుంది. సుబ్రమణ్యం వచ్చేలోపల గుమాస్తాలు సూరిగాడికి బుద్ధులు చెప్పారు. రాఁవమ్మ "అల్లాగడ్డిపెట్టండి బాబు" అంటూ కోరింది. సూరిగాడు నవ్వేసి వూరుకున్నాడు. ఆఫీసు తెరిచిన గంటన్నరకి సుబ్రమణ్యం వచ్చాడు. గుమాస్తాలు హడావిడిగా పనుల్లో సర్దుకున్నారు. మరో పావుగంటకి, రాఁవమ్మ ఆయనకోసం కాచుకుని వుందన్న విషయం సుబ్రమణ్యం చెవిలో వేసారు. రాఁవమ్మకి తొందరగానే దర్శనం దొరికింది. రాఁవమ్మ తన గోడు వెళ్ళబోసుకుంది. సుబ్రమణ్యం సూరిగాడిని పిలిచి "నిజమేనా ?" అని అడిగాడు. సూరిగాడికి తల్లిమీద చాలాకోపం వచ్చింది. తను లాటరీలెవరికోసం కడుతున్నాడు ! లాటరీలో ప్రైజువస్తే అనుభవించేదెవరు ? సుబ్రమణ్యం "నిజమేనా ?" అని మరోసారి గద్దించాడు.

"అవును" అన్నాడు సూరిగాడు.

"ఎందుకల్లా చేసావ్ ? ఇల్లెలా గడుస్తుందనుకున్నావ్ !" అని కోపంగా ప్రశ్నించాడు సుబ్రమణ్యం.


"గడవకపోతే నేనేం చెయ్యను !" అని గొణిగాడు సూరిగాడు. సుబ్రమణ్యం దిమ్మెరపోయాడు. తేరుకుని "నీకేం బాధ్యత లేదంటావ్ ?" అని అడిగాడు, ఏం చెప్తాడో అన్న కుతూహలంతో.

"ఇల్లు గడపాల్సిన డూటీ మా నాన్నది. మా నాన్నపోతే మాఅమ్మది. పిల్లల్ని కన్నవాళ్ళు" అన్నాడు సూరిగాడు నిశ్చలంగా.

సుబ్రమణ్యం ఓ క్షణం ఏమనలేక ఊరుకున్నాడు, ఆఖరికి తురుపుముక్క వాడాడు. "నీ కిచ్చిన వుద్యోగం మీ నాన్నను బట్టే ఇచ్చాం. ఎందుకో తెలుసా ? కుటుంబాన్ని ఆదుకుంటావని. మామూలుగా అయితే ఆ వుద్యోగం నీకు రాకపోను."

మామూలుగా అయితే సూరిగాడు ఇంత ఎదురు తిరగకపోను ఇవాళ రాఁవమ్మ తను పనిచేసే ఆఫీసుకువచ్చి తనమీద ఫిర్యాదుచెయ్యటం వాడికి తల గొట్టేసినట్టయింది. వాడికిప్పుడిప్పుడే అభిమానం తెలుస్తోంది.

"అంచేత నేను కష్టపడి సంపాదించే జీతంమీద మా అమ్మకేగాని నాకేం అధికారం లేదంటారా ? నేను మంచాణ్ణి




గనుక ముప్పైయ్యో, నలభైయ్యో వుంచుకుని మిగిలినది ఇంటో ఇస్తూనే వున్నానుగాని మానేలేదుకదా! నేను అనలివ్వనంటే ఏ కోర్టుమాత్రం ఏ వంటుంది?" అన్నాడు పెంకిగా సూరిగాడు.

సుబ్రమణ్యం ఇల్లాంటి పెంకి సమాధానాలు వస్తాయని ఊహించక పంచాయితీకి ఒప్పుకున్నాడు. సూరిగాడికేం సమాధానం చెప్పలేక తనిందులోంచి పరువుగా బయటపడేమార్గం ఆలోచించాడు. "అక్కులేదని నేను మాతరం అంటానా. ఇంటో నూకల్లేనప్పుడుజల్సా చెయ్యొద్దుబాబు అంటున్నాగాని" అంటూ వాదనకి దిగుతున్న రాఁవమ్మని అడ్డుకొట్టి సూరిగాడు చెప్పింది సబబుగానే వుంది. అందుకని నెలకో పాతిక రూపాయలు వాడి చేతిలోపెట్టి మిగిలినజీతం, జీతాలరోజున నువ్వేవచ్చి పట్టుకెళ్ళు" అంటూ తీర్పిచ్చాడు. రాఁవమ్మ, సూరిగాడు కూడా గత్యంతరంలేక ఆ తీర్పును ఒప్పుకున్నారు.

సుబ్రమణ్యంకి తన తీర్పు చాలా ధర్మసమ్మతంగా కనిపించింది. నాయుడు కుటుంబానికి న్యాయం చేకూర్చాననే తృప్తికలిగింది. సుబ్రమణ్యంకి నచ్చనిదల్లా సూరిగాడి ప్రవర్తన. వాడు ఈ వుద్యోగం కేవలం స్వశక్తిమీద సంపాదించుకున్నవాడిలా పెద్ద కబుర్లు చెప్పాడు ఆ విషయం గుర్తుకురాగానే సూరిగాడు తన్ని అవమానం చేసాడన్నభావం కలిగింది. పొద్దున్నే ఆఫీసుకురాగానే ఈ తగువు తీర్చాల్సిరావటం సుబ్రమణ్యంకి ఏమీ నచ్చలేదు.

ఆరోజు అతను ఆఫీసుకు వచ్చేసరికి

చాలా వుత్సాహంగా వున్నాడు. ఉత్సాహం వుంచుకోదల్చుకున్నాడు. ఆరోజు పొద్దున్న, ఎన్నాళ్ళబట్టో అనుకుంటున్న చీర భార్యకి కొనగలిగాడు. ఆఫీసుకి లేటుగా రావటానికి అది కొంతవరకు కారణం అలవాటు పెద్ద కారణం. సుబ్రమణ్యం సంతోష పడటానికి కారణం. ఆ చీర అతను కొన్నప్పుడు అతనిభార్య సంతోషించింది. సుబ్రమణ్యం భార్య సరైన పోషణలో నునుపుదేరి వంటికి నచ్చేచీరలు కట్టుకుని కలకలలాడే అందాలబొమ్మ. ఇద్దరు పిల్లల తల్లంటే ఎవరూ నమ్మలేనంత బావుంటుంది. పొద్దున్న చీర కొని, సుబ్రమణ్యం "చీరకొన్నందుకు నాకేం బహుమానం ఇస్తావ్?" అని అడిగాడు ఆవేశంగా పెళ్ళాం చెయ్యి నొక్కుతూ.

"ఆఫీసు నుంచి తొందరగా ఇంటికి రండి. తలంటిపోసుకుని, మీరు కొన్న చీరకట్టుకుని సత్కరించడానికి సిద్ధంగా వుంటాను" అంది తను ఆ బహుమానానికి సంతోషించినట్టు తెలియజేస్తూ.

సుబ్రమణ్యానికి భార్యమాటలు, రూపం గుర్తురాగానే ఇంక ఆఫీసులో వుండబుద్ధవలేదు. ఇంటికివెళ్ళిపోయాడు. పిల్లలు స్కూలుకువెళ్ళడంచేత, ఇల్లంతా శుభ్రంగాను, నిశ్శబ్దంగాను వుంది. సుబ్రమణ్యం భార్య, పొద్దున్న అతను కొనిపెట్టిన చీరకట్టుకుని, అతని కిష్టమైన పూరీలు, ముక్కాంకాయ కూరవడ్డించి, అతన్తో అతని కంచంలోనే భోంచేసింది. ఆపైన తాంబూలం ఇచ్చింది. సుబ్రమణ్యం మంచంమీద నడుంవాల్చగానే, అతని భార్యవచ్చి అతనిమీద వాలిపోయింది. ఆమెను కౌగిలిలో తీసుకుని కళ్ళల్లోకిచూస్తూ "ఉత్తరాలేమైనా వచ్చాయా!" అని అడిగాడు.

"మీ నాన్నగారి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది" అని జవాబు చెప్పిందామె.

"ఏమని రాసారు?" భార్యని కళ్ళతో తాగేస్తూ అడిగాడు.

"మామూలు పాటే. మీ తమ్ముళ్ళ కాలేజీ జీతాలు, మీ అమ్మగారి మందులు, ఆయనకొచ్చే చిన్నపించెను, మునలితనంలో మీరు ఆయన్ని ఆదుకుంటారని ఆశించటం వగైరాలు" అంది నవ్వుతూ మరికొంచెం అతనిలో ఇమిడిపోతూ.

"ఇందులో కొత్తేముంది" అని సుబ్రమణ్యం తల్లిదండ్రుల గురించి తోబుట్టువుల గురించి ఆలోచనలు దూరంగా తోసేసి, భార్యని మరింత దగ్గరగా తీసుకున్నాడు.

సుబ్రమణ్యం తండ్రి రిటైరయ్యే నాడు, ఆయన అందర్నీ బతిమాలి, తన ఆఫీసులో సుబ్రమణ్యానికి గుమాస్తా వుద్యోగం వేయించటం, పోటీ ఎంతో వున్నా ఆయనమీద ఆఫీసు వాళ్ళకున్న గౌరవంవల్ల సుబ్రమణ్యాని కావుద్యోగం రావటం సుబ్రమణ్యం మర్చిపోయి చాలారోజులైంది.